
'ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదు.
పేదింట్లో పుట్టిన ప్రతి ప్రతిభావంతుడు
ఉన్నత చదువులు చదవాలి.'

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 10+8 వెల: ₹ 5.50
సంపుటి: 17
సంచిక: 195
శనివారం 5-10-2024



చంద్రప్రభ వాహనంపై శ్రీవారు

కోరుట్ల: వేంకటేశ్వరాలయంలో స్వామివారు చంద్రప్రభ వాహనంపై దర్శనమిచ్చారు.



గోదావరిలో భక్తుల పుణ్యస్నానాలు

ధర్మపురి: పవిత్ర గోదావరిలో శుక్రవారం భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు.

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

సయోధ్య కుదిరిందా..?

- ఇటీవల కమిషనర్, పాలకవర్గం మధ్య వివాదం
- ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే చొరవతో గొడవ సద్దుమణిగినట్లు సమాచారం

జగిత్యాల: జగిత్యాల మున్సిపాలిటీ పాలకవర్గం ఏర్పడినప్పటి నుంచి వివాదాస్పదంగా మారింది. ఇటీవల తాజాగా కమిషనర్, చైర్‌పర్సన్‌కు మధ్య వివాదం చోటుచేసుకున్న విషయం తెలిసిందే. కాగా, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే జోక్యంచేసుకుని వివాదాన్ని సద్దుమణిగించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఎమ్మెల్యే సమక్షంలోనే కౌన్సిలర్లు, కమిషనర్ మధ్య కొద్దిసేపు వివాదం జరుగగా, అధికారులు, పాలకవర్గానికి సయోధ్య కుదిర్చినట్లు సమాచారం.

జగిత్యాల మున్సిపల్‌లో గతంలో పాలకవర్గానికి అధికారులకు మధ్య వివాదాలు చోటుచేసుకోవడంతో వచ్చిన కమిషనర్లు కనీసం ఏడాది కాకముందే దీర్ఘకాలిక సెలవులపై వెళ్లిపోయారు. 2020లో బీఆర్‌ఎస్ పార్టీ మొదటిసారిగా మున్సిపల్ చైర్మన్ కైవసం చేసుకోగా బోగ శ్రావణికి చైర్మన్ పదవి దక్కింది. అనంతరం చైర్‌పర్సన్ శ్రావణికి, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు మధ్య వివాదాలు చోటుచేసుకోవడంతో రాజీనామా చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఇన్‌చార్జి చైర్మన్‌గా గోలి శ్రీనివాస్ కొనసాగారు. బీసీ మహిళకు రిజర్వ్ కావడంతో అగ్రవర్ణాలకు చెందిన శ్రీనివాస్ ఇన్‌చార్జి చైర్మ న్‌గా కొనసాగడంతో అప్పుడు విమర్శలు వచ్చాయి. ఈనేపథ్యంలోనే అసెంబ్లీ ఎన్నికలు జరిగి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి చొరవ తీసుకుని జగిత్యాలకు చైర్‌పర్సన్‌ను ఎన్నుకునేలా మార్గం సుగమం చేశారు. అనంతరం బీఆర్‌ఎస్‌పార్టీకి అత్యధిక కౌన్సిలర్లు ఉన్నప్పటికీ రెబల్‌గా నిలబడిన జ్యోతి కాంగ్రెస్ కౌన్సిలర్ల మద్దతుతో చైర్‌పర్సన్ స్థానం దక్కించుకుని కాంగ్రెస్ పార్టీలో చేరారు. అలాగే భూకబ్జా యత్నం కేసులో రెవెన్యూ సెక్షన్‌కు చెందిన ఓ అధికారి, కమిషనర్‌లపై కేసు నమోదు కావడంతో వారు దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. అనంతరం సెక్రటరియేట్‌లో పనిచేస్తున్న సమ్మయ్య కమిషనర్‌గా బదిలీపై వచ్చారు. ఇటీవల పారిశుధ్య కార్మికుల నియామకంతో పాటు, కొన్ని అంతర్గత బదిలీల విషయంలో కమిషనర్‌పై ఒత్తిడి వచ్చిందని, పాలకవర్గానికి పడలేదని సమాచారం. దీంతో కమిషనర్ వద్దని సంతకాల సేకరణ సైతం చేపట్టినట్లు విశ్వసనీయంగా తెలిసింది. కాగా, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ జోక్యం చేసుకుని సయోధ్య కుదిర్చినట్లు సమాచారం.


జగిత్యాల మున్సిపాలిటీ

అభివృద్ధి ఎలా..?

వివాదాల నేపథ్యంలో ఇటీవల కమిషనర్ దీర్ఘకాలిక సెలవుపై వెళ్తానని కోరగా కలెక్టర్ అనుమతివ్వనట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఇక్కడ ఇన్‌చార్జి కమిషనర్లు ఉంటే అభివృద్ధి కుంటుపడే అవకాశం ఉంది. అంతేకాకుండా పాలకవర్గానికి సైతం మరో నాలుగు నెలలే గడువు ఉండటంతో వివాదాలు చోటుచేసుకుంటే ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలున్నాయి. ఇప్పటికే జగిత్యాల మున్సిపాలిటీ అవినీతికి నిలయంగా మారిందని ఆరోపణలు వెల్లువెత్తాయి. గతంలో ఏసీబీ అధికారులు పట్టణ ప్రణాళిక విభాగంపై దాడి చేసి రెడ్‌హ్యాండెడ్‌గా టీపీవో, ఓ కాంట్రాక్ట్ ఉద్యోగిని పట్టుకున్న విషయం తెలిసిందే. అలాగే భూ కుంభకోణంలో కమిషనర్, ఆర్వో ప్రసాద్ సస్పెండ్ కావడంతో పాటు, జైలుకు వెళ్లిన విషయం తెలిసిందే. తాజాగా మళ్లీ ఇలాంటి గొడవలు చోటుచేసుకుంటే అభివృద్ధి ఎలా సాగుతుందనే విమర్శలు వస్తున్నాయి. ఏదేమైనా అధికారులకు, పాలకవర్గానికి మధ్య సర్దుబాటు జరిగినట్లు విశ్వసనీయంగా తెలిసింది. మరో నాలుగు నెలలు అయితే స్పెషల్ అధికారి పాలన రానుంది.

డిజిటల్ కార్డు సర్వే పకడ్బందీగా చేపట్టాలి


సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు

జగిత్యాలరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేను పకడ్బందీగా చేయాలని అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. శుక్రవారం జగిత్యాల రూరల్ మండలం ఒడ్డెరకాలనీలో నిర్వహిస్తున్న డిజిటల్ ఫ్యామిలీ హెల్త్‌కార్డు సర్వేను పరిశీలించారు. సర్వే చేస్తున్న టీం ప్రతీ ఇంటింటికీ వెళ్లి అన్ని వివరాలు సేకరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమాదేవి, ఎంపీవో రవిబాబు పాల్గొన్నారు.

ఎస్సై శ్వేత సస్పెన్షన్



జగిత్యాలక్రైం: కోరుట్ల ఎస్సై-2గా పనిచేస్తున్న శ్వేతను సస్పెన్షన్ చేస్తూ మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. జగిత్యాలలోని మంచినీళ్ల బావి ప్రాంతాలకు చెందిన బొల్లారపు శివప్రసాద్ తనపై ఎస్సై శ్వేత చేయి చేసుకుందని మనస్తాపానికి గురై అక్టోబర్ 23న పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేసుకోగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించడంతో ఎస్సై శ్వేతను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం


కరాటే విద్యార్థులతో డీఎస్పీ, సీఐలు

మెట్‌పల్లి: ఆత్మరక్షణకు కరాటే ఎంతో దోహదపడుతుందని డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు అన్నారు. పట్టణంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం జపాన్ కరాటే షోటో ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రేడింగ్ పరీక్షలకు హాజరై మాట్లాడారు. చిన్నతనం నుంచే విద్యార్థులకు చదువుతో పాటు కరాటేలో శిక్షణ ఇప్పించాలన్నారు. గ్రేడింగ్ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బెల్టులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీఐ నిరంజన్‌రెడ్డి, స్టేట్ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ ఎంఎస్ పాషా, జిల్లా చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ పసునూరి అవినాష్, టెక్నికల్ డైరెక్టర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

గణేశ్‌పల్లిని పంచాయతీగా ఏర్పాటు చేయాలి

సారంగాపూర్: మండలంలోని పోతారం శివారు గ్రామం గణేశ్‌పల్లి గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. లేఖలో గణేశ్‌పల్లి గ్రామ సమస్యలు వివరిస్తూ గణేశ్‌పల్లి జనాభా వెయ్యి దాటిందని, ఓటర్లు 500పైగా ఉంటారన్నారు. రేషన్ బియ్యం కోసం గ్రామస్తులు రెండు కిలోమీటర్ల దూరంలోని పోతారంకు వెళ్లాల్సివస్తోందని పేర్కొన్నారు. సరైన వైద్య, విద్యావకాశాలు లేక తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

నైపుణ్యత ద్వారా సమస్య పరిష్కారం


శిక్షణ పొందిన సహాయకులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న అధికారులు

సారంగాపూర్: గ్రామీణ ప్రాంతాల్లో నీటి సరఫరాలో సమస్య ఏర్పడితే శిక్షణలో నేర్చుకున్న నైపుణ్యత ద్వారా సమస్య పరిష్కరించవచ్చని మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ జి.శేఖర్‌రెడ్డి అన్నారు. సారంగాపూర్ మండల పరిషత్ కార్యాలయంలో నాలుగు రోజుల పాటు నీటి సరఫరా సహాయకులకు శుక్రవారం నిర్వహించిన శిక్షణ ముగింపులో మాట్లాడారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన రెండు మండలాల నీటి సరఫరా సహాయకులకు ధృవీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో చౌడారపు గంగాధర్, డీఈ గ్రిడ్ జలేందర్, ఎంపీవోలు శశికుమార్‌రెడ్డి, ఏ వెంకటకృష్ణరాజు, ఏఈ వసీం, చందన్‌కృష్ణ, టీవోటీలు పాల్గొన్నారు.

మచ్చలేని నేత జువ్వాడి


మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- కోరుట్లలో రత్నాకర్‌రావు కాంస్య విగ్రహం ఆవిష్కరణ

కోరుట్ల: తొలితరం కాంగ్రెస్ నాయకుడైన జువ్వాడి రత్నాకర్‌రావు మచ్చలేని రాజకీయ నాయకుడని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. కోరుట్లలో ఏర్పాటు చేసిన జువ్వాడి రత్నాకర్‌రావు కాంస్య విగ్రహాన్ని శుక్రవారం ఆవిష్కరించి మాట్లాడారు. ఐదు దశాబ్దాల పాటు రాజకీయ జీవితంలో ప్రజల మనిషిగా నిలిచిన మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్‌రావు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే నైతిక విలువలకు కట్టుబడి ఉన్న విలక్షణ నేతగా నిలిచారన్నారు. తాను 1999లో శాసనసభ్యుడిగా ఎన్నిక కాక ముందు పీసీసీ అధ్యక్షుడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, పెద్దలు జువ్వాడి రత్నాకర్‌రావు, జీవన్‌రెడ్డిలు రాజకీయంలోకి తీసుకువచ్చారని తెలిపారు. వారి ఆశీస్సులతోనే ఐదు సార్లు శాసనసభ్యుడిగా ఎన్నికైనట్లు గుర్తు చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా రాజకీయాల్లో జువ్వాడి రత్నాకర్‌రావు తనను ప్రోత్సహించారన్నారు. అప్పటి సీఎం రాజశేఖర్‌రెడ్డిని మెప్పించి కోరుట్లలో విద్యార్థులకు, పాడి సంపదకు ఉపయోగపడే పశువైద్య యూనివర్సిటీని సాధించారని తెలిపారు. ఆలయాలకు ధూపదీప నైవేద్యాలను ప్రారంభించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ధర్మపురి లక్ష్మీ నర్సింహాస్వామి ఆలయం అభివృద్ధిలోనూ ఆయన పనితీరు ఆదర్శమన్నారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ తనతో పాటు కాంగ్రెస్ పార్టీకి, ప్రజలకు జువ్వాడి రత్నాకర్‌రావు ఎన్నో సేవలు అందించారన్నారు. ఆయన సేవలు చిరస్మరణీయమన్నారు. ఆయన బాటలో రాజకీయాల్లో కొనసాగడం అదృష్టమన్నారు. విప్ ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌లు మాట్లాడుతూ రత్నాకర్‌రావు ప్రతీ అంశంలోనూ ప్రజలు, రైతుల శ్రేయస్సుపై దృష్టి పెట్టి నిర్ణయాలు తీసుకునేవారన్నారు. పెద్దపల్లి, భువనగిరి ఎంపీలు గడ్డం వంశీ, కిరణ్‌కుమార్‌రెడ్డిలు మాట్లాడుతూ రాజకీయాల్లో నైతిక విలువలకు పట్టం కట్టిన వ్యక్తి రత్నాకర్‌రావు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు సంజయ్‌కుమార్, గడ్డం వినోద్‌కుమార్, ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు, కోరుట్ల, జగిత్యాల చైర్‌పర్సన్‌లు లావణ్య, జ్యోతి, కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, నాయకులు కృష్ణారావు, జువ్వాడి చంద్రశేఖర్‌రావు, కొండూరి రవీందర్‌రావు, ఆరెపల్లి మోహన్, కల్వకుంట్ల సుజిత్‌రావు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


జువ్వాడి కాంస్య విగ్రహం ఆవిష్కరిస్తున్న మంత్రి

'హామీల అమలులో కాంగ్రెస్ విఫలం'


మాట్లాడుతున్న విద్యాసాగర్‌రావు

జగిత్యాల: ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ పార్టీ విఫలమైందని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు అన్నారు. శుక్రవారం బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతు భరోసా ఎకరానికి రూ.7 వేలు, కల్యాణలక్ష్మీ పథకం అదనంగా తులంబంగారం అని చెప్పిన హామీ అమలు ఎక్కడ అని ప్రశ్నించారు. ఒక మహిళా మంత్రి మరో మహిళను కించపరిచే విధంగా మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. హైడ్రా పేరుతో ప్రజలను తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని, ప్రభుత్వానికి పేదల ఉసురు తగులుతుందని విమర్శించారు. ఈ సమావేశంలో జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, బీఆర్‌ఎస్ నాయకులు గట్టు సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యవసాయాధికారిగా రాంచందర్



జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాల జిల్లా వ్యవసాయాధికారిగా నియామకమైన రాంచందర్ శుక్రవారం జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ధర్మపురి ఏడీగా పనిచేస్తున్న రాంచందర్‌ను ఇక్కడికి బదిలీ చేయగా, ఇక్కడ పనిచేసిన బి.వాణిని హైదరాబాద్ వ్యవసాయ శాఖ కమిషనరేట్‌కు బదిలీ చేశారు.

సర్టిఫికెట్ల జారీలో జాప్యం చేయొద్దు

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కథలాపూర్: సర్టిఫికెట్లు జారీ చేయడంలో జాప్యం చేయొద్దని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కథలాపూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం కథలాపూర్, మేడిపల్లి, భీమారం మండలాల అధికారులు, ప్రత్యేకాధికారులు, కార్యదర్శులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. వివిధ సర్టిఫికెట్ల కోసం కార్యాలయాలకు వచ్చే ప్రజలను పలువురు అధికారులు ఇబ్బంది పెడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని అన్నారు. గ్రామపంచాయతీల్లో నిధులు పుష్కలంగా ఉన్నందున దసరా, బతుకమ్మ ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో వీధిలైట్ల గురించి ప్రత్యేకాధికారులు, కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో రోడ్డుకిరువైపులా మొక్కలు నాటాలన్నారు. గ్రామకూడళ్ల వద్ద పూలకుండీలు ఏర్పాటు చేసి ప్రత్యేకతను చాటాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీవో రఘువరణ్, ఆర్డీవో శ్రీనివాస్, మండల ప్రత్యేకాధికారి మదన్‌మోహన్, ఎంపీడీవోలు శంకర్, పద్మావతి, తహసీల్దార్లు వినోద్, వసంత, రవికిరణ్, ఏపీఎంలు నరహరి, అశోక్, ఏఈలు చంద్రశేఖర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వెరిఫికేషన్‌కు హాజరు కావాలి

జగిత్యాల: డీఎస్సీ 2024లో తాత్కాలికంగా స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీ, పీఈటీ, పండిత్‌పోస్టులకు 1:3 రేషియోలో ఎంపికై సర్టిఫికేషన్ వెరిఫికేషన్ కోసం హాజరుకాని అభ్యర్థులు శనివారం హాజరు కావాలని డీఈవో జగన్మోహన్‌రెడ్డి తెలిపారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి


మాతాశిశు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కర్ణన్

- హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ స్పెషల్ ఆఫీసర్ కర్ణన్

జగిత్యాల: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ స్పెషల్ ఆఫీసర్ ఆర్‌వీ కర్ణన్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని కలెక్టర్ సత్యప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. రోగులకు వైద్యసేవలు ఎలా అందుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. బయోమెడికల్ వేస్టేజ్‌ను ఎక్కడికి తరలిస్తున్నారని అధికారులను ప్రశ్నించగా డంపింగ్ యార్డుకు తరలిస్తున్నట్లు సమాధానమిచ్చారు. అనంతరం ప్రభుత్వం చేపట్టిన ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేలో భాగంగా హౌసింగ్‌బోర్డు కాలనీలో పర్యటించారు. కుటుంబ నిర్ధారణ వివరాలను తప్పులు లేకుండా నమోదు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఆర్డీవో శ్రీనివాస్, డీఎంహెచ్‌వో సమియొద్దీన్ తదితరులున్నారు.

డిజిటల్ కార్డు సర్వే పరిశీలన

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం ఒడ్డెరకాలనీలో జరుగుతున్న ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేను శుక్రవారం ప్రత్యేకాధికారి కర్ణన్ పరిశీలించారు. ప్రతీ కుటుంబ వివరాలను పొందుపర్చాలని కోరారు. అనంతరం కుటుంబసభ్యుల వద్దకు వెళ్లి సర్వే వివరాలు చూసి సంతృప్తి వ్యక్తం చేశారు.

తప్పులు లేకుండా వివరాలు నమోదు చేయాలి

- కలెక్టర్ సత్యప్రసాద్

కోరుట్ల రూరల్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేలో తప్పులు లేకుండా ప్రతీ కుటుంబం వివరాలు నమోదు చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. మండలంలోని సర్పరాజ్‌పూర్‌లో నిర్వహిస్తున్న డిజిటల్ కార్డు సర్వేను శుక్రవారం పరిశీలించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో నక్క శ్రీనివాస్, ఎండీవో ఒడెల రామకృష్ణ, ఎంపీవో కృపాకర్, పంచాయతీ సెక్రటరీ మాధవి తదితరులు పాల్గొన్నారు.


సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం చేయూత

- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలరూరల్: ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధికి చేయూతనందిస్తూ, అన్ని రంగాల్లో రాణించేందుకు ప్రోత్సహిస్తోందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని 16వ వార్డులో పొరండ్ల గ్రామానికి చెందిన శ్రీసాయి స్వశక్తి మహిళా సంఘాల సభ్యులు ఏర్పాటు చేసిన శ్రీలక్ష్మీ బోటిక్ లేడీస్ క్లాత్ హౌస్‌ను, 37వ వార్డులో వెల్దుర్తి గ్రామ అరుంధతి స్వశక్తి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీకృతి ఎంబ్రాయిడరీ లేడీస్ టేలర్‌ను శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. రాష్ట్రంలోని మహిళలందరికీ స్వయం ఉపాధి కల్పించడంతో పాటు వారిని ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా బ్యాంకు రుణాలు ఇస్తూ ప్రోత్సహిస్తోందన్నారు. కార్యక్రమంలో ఏపీఎం గంగాధర్, మాజీ మున్సిపల్ చైర్మన్ నాగభూషణం, కౌన్సిలర్ కూతురు రాజేశ్, కూసరి అనిల్, తోట మల్లికార్జున్, క్యాదాసు నవీన్, పిట్ట ధర్మరాజు, అల్లె గంగాసాగర్, నాయకులు పాల్గొన్నారు.


మహిళా సంఘాల సభ్యులతో ఎమ్మెల్యే సంజయ్

శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్ అందజేత

మహిళా శక్తి యూనిట్ ఈవెంట్ మేనేజ్‌మెంట్‌లో హైదరాబాద్‌లో శిక్షణ పూర్తిచేసుకున్న జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ గ్రామానికి చెందిన మహిళా సంఘం సభ్యురాలు విజయకు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సర్టిఫికెట్ అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎం గంగాధర్, మేకల పవన్ పాల్గొన్నారు.

కుల సంఘాల సంక్షేమానికి బీఆర్‌ఎస్ కృషి

- కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్

కోరుట్ల: కుల సంఘాల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ఎంతో కృషి చేసిందని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. కోరుట్ల పట్టణంలోని పద్మశాలీ సంఘ నూతన భవన నిర్మాణానికి బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావుతో కలిసి శుక్రవారం శంకుస్థాపన చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పద్మశాలీ సంఘ భవనానికి నిధులు మంజూరయ్యాయని, భవన నిర్మాణానికి భూమి కేటాయించినట్లు గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత వస్త్రాల ఉత్పత్తిని ప్రోత్సహించాలని, గతంలో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ నేతన్నల ఎదుగుదలకు పాటుపడ్డారని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తిరుపతి, పద్మశాలీ సంఘం పట్టణ అధ్యక్షుడు ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు సాంబమూర్తి, కిశోర్, నర్సయ్య, మధు, ప్రసాద్, నవీన్, ధనుంజయ్ పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్


'సన్న' రైతుకు ఊరట

- సన్నాల సాగుకు మొగ్గుచూపిన అన్నదాతలు
- జిల్లాలో ఈసారి లక్ష ఎకరాల వరకు సాగు
- కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయానికి సిద్ధం
- ఈసారి మిల్లులకు తరలించేది తక్కువే..

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లా వరి ధాన్యం సాగుకు పెట్టింది పేరు. ఎక్కువమంది రైతులు దొడ్డు రకాలనే సాగుచేస్తుంటారు. అయితే కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించింది. అధికారంలోకి వచ్చాక సన్నరకానికి మాత్రమే బోనస్ ఇస్తామని ప్రకటించడంతో గతేడాదితో పోల్చితే ఈసారి సన్నాల సాగుకే రైతులు మొగ్గుచూపారు.

లక్ష ఎకరాల్లో సన్న ధాన్యం సాగు

జిల్లాలో సాగు నీటివనరులు పుష్కలంగా ఉండటంతో వానాకాలం సీజన్‌లో 3.02 లక్షల ఎకరాల్లో వరిసాగు చేస్తారు. ఇందులో దొడ్డు రకాలను దాదాపు రెండులక్షల ఎకరాల వరకు సాగైంది. అలాగే భోజనానికి ఉపయోగించే సన్న ధాన్యం సాగు లక్ష ఎకరాల వరకే పరిమితమైంది. సన్నరకాలకు తెగుళ్లు, పురుగులు ఆశించడటంతో ఎకరాకు సగటున 20 నుంచి 22 క్వింటాళ్ల వరకే దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ఈ లెక్కన జిల్లాలో 18 నుంచి 21 లక్షల క్వింటాళ్ల దిగుబడి రానుంది.


గింజ దశకు చేరుకుంటున్న సన్నరకం వరి

మిల్లులకు నై.. కొనుగోలు కేంద్రాలకు సై

సాధారణంగా సన్నధాన్యాన్ని 10 లక్షల క్వింటాళ్ల వరకు రైతులు కుటుంబ అవసరాలకు ఉంచుకుంటారు. గతేడాది జైశ్రీరాం, బీపీటీ వంటి సన్నాల బియ్యానికి క్వింటాల్‌కు రూ.6వేల నుంచి రూ.7వేలు పలకడంతో ఈసారి కొంతమంది ధాన్యాన్ని మర ఆడించి బియ్యం అమ్మేందుకు చూస్తున్నారు. మిగిలిన సన్న ధాన్యాన్ని గతంలో రైస్‌మిల్లుల్లో విక్రయించి వారు ఇచ్చిన మొత్తంతోనే సంతృప్తి చెందేవారు. ప్రస్తుతంప్రభుత్వంబోనస్ ఇస్తామని ప్రకటించ డం .. రేషన్‌కార్డుదారులకు సన్నబియ్యం సరఫరా చేస్తామని చెబుతుండడంతో మిల్లర్లకు విక్రయించే అవకాశం తక్కువ. అదే సమయంలో కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వ మద్దతు ధర రూ.2300తోపాటు బోనస్ రూ.500కలుపుకొని రూ.2800 వచ్చే అవకాశం ఉంది.

కొనుగోలు కేంద్రంలోనే అమ్ముతా



గతంలో సన్న ధాన్యాన్ని రైస్‌మిల్లులో అమ్మేవాడిని. ఇప్పుడు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పడంతో కొనుగోలు కేంద్రంలోనే అమ్మాలని నిర్ణయించుకున్నాను.

– కోల నారాయణ, చల్‌గల్

సన్నాల సాగుకు ఖర్చెక్కువ



దొడ్డురకంతో పోల్చితే సన్న ధాన్యానికి ఖర్చు ఎక్కువ. తెగుళ్లు సోకుతాయి. కనీసం రెండు, మూడుసార్లు పిచికారీ చేయాల్సి వస్తుంది. ఎకరాకు 20 క్వింటాళ్లు కూడా దిగుబడి రాదు.

– మల్లారెడ్డి, ఎండపల్లి

క్లుప్తంగా

పోక్సో కేసులో ప్రభుత్వ ఉపాధ్యాయుడి అరెస్టు

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు పి.వెంకటస్వామిని గురువారం రాత్రి పోక్సో కేసులో పట్టణ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. విద్యాబుద్ధులు చెప్పాల్సిన ఉపాధ్యాయుడు విద్యార్థినులపై అసభ్యకరంగా ప్రవర్తించడంతో బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు.

మృతదేహం లభ్యం

మేడిపల్లి: రెండు రోజుల క్రితం కథలాపూర్ మండలం దుంపేట గ్రామశివారు వరదకాలువలో గల్లంతైన నేతుల మల్లేశం మృతదేహం శుక్రవారం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతకుంట గ్రామానికి చెందిన నేతుల మల్లేశం వరదకాలువలో పడి గల్లంతైనట్లు రెండు రోజుల క్రితం కథలాపూర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. శుక్రవారం మేడిపల్లి మండలం విలయతబాద్ గ్రామ శివారు దొంగలమర్రి ప్రాంతం సమీపంలోని వరదకాలువలో వ్యవసాయ మోటార్‌కు గుర్తు తెలియని మృతదేహం తట్టుకొని ఉండటాన్ని గమనించిన రైతులు పోలీసులకు సమాచారం అందించారు. కథలాపూర్ ఎస్సై నవీన్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని గత ఈతగాళ్లతో వెలికి తీయించారు. మృతదేహంపై ఉన్న ఆనవాళ్లతో నేతుల మల్లేశంగా నిర్ధారించి సంఘటన స్థలంలోనే పంచనామా నిర్వహించారు. మృతుడు నేతుల మల్లేశంకు కుటుంబ గొడవలు ఉన్నట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. ఘటనస్థలాన్ని కోరుట్ల సీఐ సురేష్‌బాబు పరిశీలించారు.

పాముకాటుతో మహిళా కూలీ మృతి


లక్ష్మి (ఫైల్)

కథలాపూర్(వేములవాడ): కథలాపూర్ మండలం తాండ్ర్యాల గ్రామానికి చెందిన పత్రి లక్ష్మి(33) అనే మహిళా కూలీ పాముకా టుకు గురై శుక్రవారం మృతిచెందింది. లక్ష్మి శుక్రవా రం మొక్కజొన్న పంటను కోయడానికి కూలీ పనికి వెళ్లింది. మొక్కజొన్న పంటను కోస్తుండగా పాముకాటు వేసింది. వెంటనే తోటి కూలీ లు కోరుట్ల ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందింది. మృతురాలి భర్త జలంధర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. మృతురాలికి భర్తతోపాటు కొడుకు, కూతురు ఉన్నారు.

కోరుట్లపేటలో దొంగతనం

- బంగారం, నగదు అపహరణ

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేటకు చెందిన గంద్ర ధర్మారావు ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాలు. ధర్మారావు గత నెల ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌లోని బంధువుల ఇంటికి వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టారు. బీరువాలో దాచిన రూ.15వేల నగదుతోపాటు తులంన్నర బంగారు గొలుసును ఎత్తుకెళ్లారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి తిరిగి వచ్చిన ధర్మారావు ఇంట్లో దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

విషజ్వరంతో బాలుడి మృతి

పాలకుర్తి(రామగుండం): ఈసాలతక్కళ్లపల్లి గ్రామానికి చెందిన కంటె చిన్నా(14) విషజ్వరంతో శుక్రవారం మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కంటె స్వామి కుమారుడు చిన్నా ఓ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. పదిరోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. చికిత్స పొందుతున్నా తగ్గలేదు. రెండురోజుల క్రితం పరిస్థితి విషమించింది. కిడ్నీలకు ఇన్ఫెక్షన్ సోకింది. దీంతో ఆరోగ్య పరిస్థితి విషమించి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. బాలుడి తండ్రి స్వామి స్థానిక అంకమెట్టు గుట్టపై చిన్నయ్య– పెద్దయ్య దేవుని ఆలయంలో పూజారిగా పనిచేస్తున్నారు.

లెక్క తీస్తున్నారు..

- గ్రామపంచాయతీల్లో కొనసాగుతున్న ఆడిట్
- ఆదాయ, వ్యయ వివరాల పరిశీలన
- ప్రభుత్వ ఖజానాలో జమకాని ఆదాయం
- నవంబర్ నెలాఖరులోగా లెక్కలు పూర్తికి చాన్స్
- పంచాయతీ అధికారుల్లో గుబులు


కమాన్‌పూర్ గ్రామపంచాయతీ కార్యాలయం

కరీంనగర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీలకు విడుదల చేసిన నిధులు, ఆదాయ, వ్యయ, జమ వివరాలతో పాటు గ్రామపంచాయతీల్లో చోటు చేసుకున్న అవినీతిని వెలికితీసేందుకు జిల్లా ఆడిట్ అధికారులు లెక్కలు తీస్తున్నారు. జిల్లాలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆన్‌లైన్ ఆడిట్ ప్రారంభమైంది. దీంతో పంచాయతీ అధికారుల్లో భయం మొదలవుతోంది. ఏ పంచాయతీ అవినీతి బాగోతం బయటకు వస్తుందోనని ఆసక్తి నెలకొంటోంది. కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులను ఏడాదికి రెండుసార్లు గ్రామాలకు విడుదల చేస్తుంది. ఆ నిధులతో పాటు ఇతర నిధులపై ఆరా తీసేందుకు జిల్లా ఆడిట్‌శాఖ బృందాలు కసరత్తు చేస్తున్నాయి. నవంబర్ నెలాఖరులోగా జిల్లాలోని 313పంచాయతీల్లో ఆడి ట్ నిర్వహణ పూర్తి చేసేందుకు అధికారులు ప్రణాళిక అమలు చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో ఆడిట్ పూర్తయ్యింది. కరీంనగర్ కార్పొరేషన్‌లో జరగాల్సి ఉంది. అగ్రికల్చర్ మార్కెటింగ్‌శాఖలో జూలై నెలలోనే ఆడిట్ పూర్తి చేసి నివేదిక ప్రభుత్వానికి అందజేశారు. షెడ్యూల్ ప్రకారం నవంబర్ చివరి నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంది. పూర్తిస్థాయిలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ విభాగాల ఆడిట్‌ను డిసెంబర్ 31నాటికి పూర్తి చేస్తారు. వ్యయాలపై అభ్యంతరాలు ఉంటే పరిష్కరించడానికి డిసెంబర్ తుదివరకు గడువు ఇచ్చి, తుది నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తారు.

313 జీపీల్లో కొనసాగుతున్న ఆడిట్

జిల్లాలో ఆగస్టు చివరి వారం నుంచి ఆడిటింగ్ ప్రారంభించారు. దాదాపు 100 పంచాయతీల్లో తొలి విడత విజయవంతంగా పూర్తయినట్లు సమాచారం. 80శాతం ఆన్‌లైన్, 20శాతం ఆఫ్‌లైన్ ద్వారా గ్రామపంచాయతీల్లో రికార్డుల నిర్వహణ మొదటి విడతగా చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో చాలా జీపీల్లో నిర్వహించిన ఆడిట్‌లో ఆసక్తికర విషయాలు వెలుగుచూసినట్లు అధికారులు చెబుతున్నారు. కొన్ని పంచాయతీలలో ప్రభుత్వానికి సీనరేజ్ చార్జీలు చెల్లించలేదని, ఐటీ చెల్లించడం లేదని, జీఎస్టీ బకాయిలు, ప్రభుత్వ ఖజానాలో జమ చేయడం లేదని తేలినట్లు తెలిసింది. ఆడిట్ సమయంలో రికార్డులు చూపించని పంచాయతీలు 40 రోజులలోగా సరైన రికార్డులతో పాటు హార్డ్ కాపీలను అధికారులకు అందజేయాల్సి ఉంటుంది. గడువులోగా వివరాలు సమర్పించకపోతే ఆడిట్‌లో తేలిన విషయాలను ప్రభుత్వానికి నివేదించాల్సి ఉంటుందని ఆడిట్ అధికారులు పేర్కొంటున్నారు.

నవంబర్ నెలాఖరులోగా పూర్తి

జిల్లాలో ఆగస్టు నుంచి మొదలైన ఆడిట్ నవంబర్ నెలాఖరులోగా పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు ముమ్మరం చేశారు. అడిట్ బృందాలు నేరుగా గ్రామపంచాయతీలకు వెళ్లి ఆడిట్ చేపడుతున్నారు. బృందం సభ్యులంతా ఒకే దగ్గర ఆడిట్ చేయాల్సి వస్తే మండల పంచాయతీ కార్యాలయాల్లో అడిట్ చేయనున్నారు. ఇందుకు ఆయా గ్రామపంచాయతీలకు సంబంధించిన ఆదాయ, వ్యయ వివరాల రికార్డులు పనులకు సంబంధించి ఎంబీ రికార్డులను ఎంపీడీవో ఆఫీసులకు పంచాయతీ అధికారులు తీసుకెళ్లాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ ఆడిట్ చిన్నపంచాయతీల్లో రెండు రోజుల్లో, పెద్ద పంచాయతీల్లో నాలుగు రోజుల సమయం పడుతుందని ఆడిట్ అధికారులు చెబుతున్నారు.

ఆడిట్ మొదలైంది



జిల్లాలోని 313 గ్రామ పంచాయతీల్లో ఇప్పటికే 100 గ్రామపంచాయతీల్లో ఆన్‌లైన్‌లో ఆడిట్ పూర్తయ్యింది. నాలుగు మున్సిపాల్టీలకు గాను మూడు మున్సిపాల్టీల్లో ఆడిట్ ముగిసింది. అగ్రికల్చర్ మార్కెటింగ్ శాఖలో ఆడిట్ జులైనెలలోనే ఆడిట్ పూర్తి చేసి నివేదిక పంపించాం. నవంబర్ నెలాఖరులోగా ఆడిట్ పూర్తి చేసేందుకు బృందాలను ఏర్పాటు చేశాం. నేరుగా పంచాయతీలకు లేదా ఎంపీవో కార్యాలయాలకు వెళ్లి ఆడిట్ చేయనున్నాం.

– కరిపె రాజ్‌కుమార్, జిల్లా ఆడిట్ అధికారి

ఉన్నత చదువు ఆశ తీరక..

- పీజీ విద్యార్థిని ఆత్మహత్య
- కుటుంబ, ఆర్థిక పరిస్థితులతో మనస్తాపం


రమ్య (ఫైల్)

ఫర్టిలైజర్‌సిటీ(రామగుండం): ఉన్నత చదువులు చదువుదామని ఆశపడిన యువతి కుటుంబ ఆర్థిక పరిస్థితులతో మనస్తాపం చెంది ఉరేసుకుని తనువు చాలించింది. వివరాలిలా ఉన్నాయి. ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ ప్రగతినగర్‌కు చెందిన ఆషాడపు కొమురయ్యకు ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కుమార్తె ఆషాడపు రమ్య(22) పీజీ వరకు విద్యనభ్యసించింది. ఇంకా ఉన్నత చదువులు చదువుకుందామని ఆశపడింది. తాను చదువుకుంటానని ఇంట్లో తెలిపింది. అయితే, ఆర్థిక పరిస్థితులతో ఉన్నత చదువులు చదవలేకపోతున్నానని మనస్తాపం చెంది శుక్రవారం ఇంట్లో ఉరేసుకుని మృతి చెందింది. మృతురాలి తండ్రి కొమురయ్య ఫిర్యాదు మేరకు ఎస్సై సతీశ్ కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రమ్య మృతితో ప్రగతినగర్ కాలనీలో విషాదం అలముకుంది.

బల్దియా భవనం ఎక్కి..

- ఎలక్ట్రీషియన్ ఆందోళన


బల్దియా భవనంపై ఎలక్ట్రీషియన్ కనకయ్య

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరపాలక సంస్థలో ఔట్ సోర్సింగ్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న కనకయ్య శుక్రవారం మున్సిపల్ కార్యాలయ భవనంపైకి ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానని ఆందోళన చేశాడు. ఓ డివిజన్ కార్పొరేటర్‌తోపాటు అతడి సోదరుడు తమ డివిజన్‌లో విద్యుత్ దీపం వెలగడం లేదని చెబితే దానికి మరమ్మతు చేశానని బాధితుడు తెలిపారు. అయినా, మళ్లీమళ్లీ ఫోన్లు చేస్తూ తనను మానసికంగా వేధింపులకు గురి చేయడంతోపాటు సోషల్ మీడియాలో తనపై పోస్టులు పెట్టి, అధికారులకు కూడా తనపై ఫిర్యాదులు చేశారని ఆరోపించాడు. దీంతో మనస్తాపం చెంది భవనంపైకి ఎక్కి ఆత్మహత్యకు యత్నించినట్లు కనకయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. బల్దియా అధికారులు, తోటి ఉద్యోగులు జోక్యం చేసుకుని నచ్చజెప్పడంతో ఆందోళన విరమించాడు.

లక్కీ డ్రా నిర్వాహకులపై కేసు

- సీఐ వెంకటేశ్వర్లు


లక్కీ డ్రా పేరిట వెలసిన పోస్టర్లు

సిరిసిల్లక్రైం: చందుర్తి మండల కేంద్రంలో దుర్గమ్మ విగ్రహాల వద్ద లయన్స్ యూత్ చందుర్తి ఆధ్వర్యంలో లక్కీ డ్రా పేరిట డబ్బులు వసూలు చేస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్లు చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఒక్కో లక్కీ డ్రా టికెట్ రూ.99 వసూలు చేస్తూ మొదటి బహుమతిగా రిఫ్రిజిరేటర్, రెండో బహుమతిగా సైకిల్, మూడో బహుమతిగా రైస్‌కుక్కర్ అంటూ ఫ్లెక్సీ పెట్టి ప్రచారం చేస్తున్న వెంగళ వెంకటేశ్, రాచర్ల సాయిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు. అలాగే తిమ్మాపూర్‌లో దుర్గామాత కమిటీ ఆధ్వర్యంలో దుర్గామాత ముక్కుపుడుక పేరుతో లక్కీ డ్రా కోసం రూ.200 వసూలు చేస్తున్న నిర్వాహకులు నల్లపు దివాకర్, మార్త భూమరాజుపై కూడా కేసు నమోదు చేసినట్లు వివరించారు. లక్కీ డ్రా పేరిట డబ్బులు వసూలు చేయడం తప్పని సీఐ తెలిపారు. లక్కీ డ్రా నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యావేత్తను.. ఎమ్మెల్సీగా గెలిపించండి

- వాకర్స్‌తో అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి


నరేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న వాకర్స్ ప్రతినిధులు

కొత్తపల్లి(కరీంనగర్): గత ఎన్నికల్లో రాజకీయ నాయకులకు అవకాశం ఇచ్చారు.. తాను విద్యావేత్తను.. ఈసారి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపించాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం కరీంనగర్‌లోని అల్కాపురి కాలనీ వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. పట్టభద్రుల నియోజకవర్గ పరిధిలో లక్షలాది మంది పట్టభద్రులు ఉన్నప్పటికీ ఇప్పటివరకు 1.97 లక్షల మంది మాత్రమే ఓటరుగా పేరును నమోదు చేసుకున్నారని తెలిపారు. గతంలో గెలిచిన ఎమ్మెల్సీలు రాజకీయాలకే సమయం కేటాయించారు తప్ప నిరుద్యోగుల గురించి పట్టించుకోలేదని ఆరోపించారు. తనను గెలిపిస్తే నిరుద్యోగులకు అండగా నిలిచి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. 2021 నాటికి పట్టభద్రులైనవారు వచ్చే నెల 6వ తేదీలోగా ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.

గుండెపోటుతో ఉపాధ్యాయురాలి మృతి


నాగరాణి (ఫైల్)

రామడుగు: వెదిర గ్రామానికి చెందిన ముత్యం నాగరాణి(అందురాలు 33) అనే ప్రభుత్వ ఉపాధ్యాయురాలు శుక్రవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. నాగరాణి గర్భవతి కావడంతో కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ప్రయివేట్ వైద్యశాలలో చికిత్స కోసం బుధవారం తీసుకెళ్లారు. చికిత్స పొందుతున్న నాగరాణికి బీపీ సమస్య రావడంతోపాటు గుండెపోటు వచ్చి శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందింది. నాగరాణి కొన్ని సంవత్సరాలు వెదిర గ్రామ పరిధిలోని రాజాజీనగర్ ప్రాథమిక పాఠశాలలో ఉద్యోగం చేసి ఇటీవల కొత్తపల్లి మండలం కొత్తపల్లి ప్రాథమిక పాఠశాలకు బదిలీ అయ్యారు.

చెర్లకొండాపూర్‌లో అధికారుల బృందం పర్యటన

సాక్షి ఎఫెక్ట్


నీటిని పరిశీలిస్తున్న ఈఈ రమేశ్, ఎంపీడీవో చిరంజీవి

రాయికల్(జగిత్యాల): చెర్ల కొండాపూర్ గ్రామాన్ని కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశాల మేరకు ఇరిగేషన్, వైద్యాధికార బృందం సభ్యులు శుక్రవారం సందర్శించి, వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శుక్రవారం 'సాక్షి'లో 'చెర్లకొండాపూర్‌లో ఫ్లోరైడ్ భూతం' శీర్షికన ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీని వాస్‌తో మాట్లాడి గ్రామంలో వైద్య శిబిరం ఏర్పా టు చేయాలని ఆదేశించడంతో మండల వైద్యాధికా రి సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. మిషన్ భగీరథ ఈఈ రమేశ్, ఎంపీడీవో చిరంజీవి గ్రామాన్ని సందర్శించి తాగునీటి బావి, బోర్లను పరిశీలించారు. నీటిని సేకరించి ల్యాబ్ తరలిస్తున్నట్లు తెలిపారు. కొంతవరకు నీళ్లు చిలుముగా వస్తున్నాయని ఇరిగేషన్ ఈఈ తెలిపారు. ఈ సమస్యను వెలుగులోకి తీసుకువచ్చిన 'సాక్షి'కి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

అనారోగ్యంతో కోడెలు మృతి


కోడెలను ఖననం చేస్తున్న సిబ్బంది

వేములవాడ అర్బన్: రాజన్న తిప్పాపూర్ గోశాలలోని కోడెలు మూడు అనారోగ్యంతో మృతిచెందాయి. వాటిని గోశాల సిబ్బంది గుట్టుచప్పుడు కాకుండా మూలవాగులో ఖననం చేశారు. సిబ్బంది పట్టించుకోకపోవడంతోనే కోడెలు మృతిచెందాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై గోశాల ఇన్‌చార్జి ఏఈవో శ్రీనివాస్‌ను వివరణ కో రగా భక్తులు జెర్సీ చిన్నకోడెలు తేవడంతో అనారోగ్యం బారిన పడి పొంది మృతిచెందినట్లు తెలిపారు.

రక్తదానం చేయండి



కరీంనగర్ అర్బన్: రక్తదానం చేసి ప్రాణాలు నిలపాలని కరీంనగర్ ప్రాంతీయ పశు సంవర్ధక శిక్షణా కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ నల్ల లింగారెడ్డి అన్నారు. శుక్రవారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కరీంనగర్ విభాగం ద్వారా స్థానిక ప్రాంతీయ పశు సంవర్ధక శిక్షణా కేంద్రంలో రక్తదాన శిబిరం జరిగింది. ఎన్ని దానాలు ఉన్నా, రక్తదానాన్ని మించింది లేదని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితిలో ప్రాణాన్ని కాపాడే రక్తదానం చేయటానికి ప్రతీఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. శిక్షణా కేంద్రం ద్వారా గతంలో, వివిధ సందర్భాలలో ఇలా ఎన్నో సార్లు రక్తదానాన్ని చేశామని, ప్రస్తుతం తాము చేసిన ఏడో విడత రక్తదానం అని తెలిపారు. శిబిరంలో మొత్తం 34 మంది స్వచ్ఛందంగా రక్తదానాన్ని చేశారు. జిల్లా పశు వైద్యాధికారి వేణుగోపాల్, అసిస్టెంట్ డైరెక్టర్ ఎ.వినోద్ కుమార్, శిక్షణా కేంద్రం డాక్టర్లు ఎం.కోటేశ్వరరావు, సాయి చైతన్య, దివ్య, సూపరింటెండెంట్ గూడ ప్రభాకర్ రెడ్డి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కరీంనగర్ విభాగ చైర్మన్ పి.కేశవరెడ్డి, సెక్రటరీ వి.రాధాకృష్ణారెడ్డి, మెడికల్ ఆఫీసర్ ఎం.ఎల్.ఎన్.రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అడ్మిషన్లకు గడువు పొడిగింపు

కరీంనగర్: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ 2024–25 విద్యా సంవత్సరానికి గానూ ఎస్‌ఎస్‌సీ, ఇంటర్మీడియట్ కోర్సులలో అడ్మిషన్ల కోసం దరఖాస్తు గడువును ఈనెల 31వరకు పొడిగించినట్లు డీఈవో జనార్దన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యాసకులు ఆన్‌లైన్ దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు. తరువాత సంబంధిత గుర్తింపు పొందిన సంస్థలకు (పాఠశాలలు/కళాశాలలు) అవసరమైన అన్ని పత్రాలను సమర్పించడం తప్పనిసరి అని డీఈవో పేర్కొన్నారు.

చైన్ బిజినెస్ పేరిట మోసం

- ఇల్లంతకుంటలో ఇద్దరిపై కేసు
- మోసాలకు పాల్పడితే కటకటాలే
- ఎస్పీ అఖిల్‌మహాజన్

ఇల్లంతకుంట(మానకొండూర్): చైన్ బిజినెస్ పేరిట ప్రజలను మోసం చేస్తున్న వారికి కటకటాలు తప్పవని ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం వివరాలు వెల్లడించారు. ఇల్లంతకుంట మండల కేంద్రంలో హెర్బల్ లైఫ్ న్యూట్రీషియన్ ప్రోడక్ట్స్ కొనుగోలు చేసి అమ్మితే లాభాలు వస్తాయంటూ ముగ్గురి దగ్గర రూ.9లక్షలు వసూలు చేసిన మోసానికి పాల్పడ్డ ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్పీ పేర్కొన్నారు. తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లికి చెందిన బొజ్జ లక్ష్మణ్, లాస్య ఇల్లంతకుంటలో ఫ్రిన్స్ న్యూట్రీషియన్ సెంటర్ నడుపుతూ.. మండలంలోని ముస్కాన్‌పేటకు చెందిన సావనపెల్లి శైలజ, జెట్టి విజయలక్ష్మి, అంతగిరికి చెందిన వల్లంపట్ల సుమలతల నుంచి రూ.3లక్షల చొప్పున తీసుకొని న్యూట్రీషియన్ ఫుడ్ విక్రయించారు. న్యూట్రీషియన్‌ఫుడ్ సేల్స్ పెంచితే ప్రతీ నెల రూ.50వేలు లాభం వస్తుందని నమ్మబలికారు. ఒకవేళ అమ్ముడుపోకపోతే తిరిగి డబ్బులు ఇస్తామని బొజ్జ లక్ష్మణ్, లాస్య హామీ ఇచ్చారు. న్యూట్రీషియన్ ఫుడ్ ఎవరూ కొనుగోలు చేయకపోవడంతో బాధితులు తమకు డబ్బులు ఇవ్వాలని వారిని కోరారు. అయితే ఏడాదిగా డబ్బుల గురించి బుకాయిస్తుండడంతో స్థానిక ఠాణాలో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదుతో బొజ్జ లక్ష్మణ్, లాస్యలపై కేసునమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

ఉరేసుకుని డిప్లొమా విద్యార్థి ఆత్మహత్య

గోదావరిఖని(రామగుండం): జల్సాలకు అలవాటు పడిన స్థానిక లెనిన్‌నగర్‌లోని తాండ్ర నితిన్(23) అనే డిప్లొమా విద్యార్థి శుక్రవారం తన ఇంట్లో ఉరి వేసుకొని మృతి చెందాడు. వన్ టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి కథనం ప్రకారం.. హైదరాబాద్‌లో టెక్నాలజీలో డిప్లొమా కోర్సు చదువుతున్న నితిన్.. రెండు నెలలుగా ఇక్కడే ఉండి ప్రైవేట్‌లో కంప్యూటర్ కోర్సు నేర్చు కుంటున్నాడు. ఈ క్రమంలో విపరీతమైన మద్యం తాగేందుకు, ఇతర జల్సాలకు అలవాడు పడ్డాడు. డబ్బులు ఇవ్వమని తల్లి దండ్రులను వేధిస్తున్నాడు. మరో కోర్సు నేర్చుకుంటానని, దానికి రూ.లక్ష వరకు ఖర్చు అవుతుందని, ఆ డబ్బులు ఇవ్వాలని గొడవ చేస్తున్నాడు. డబ్బులు ఇస్తే తాగి మద్యం తాగి జల్సాలు చేస్తాడని తల్లిదండ్రులు ఇవ్వలేదు. దీంతో మనస్తాపం చెందిన లెనిన్ శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేనిసమయంలో స్లాబ్‌కు ఉన్న ఇనుప కొండికి ఉరి వేసుకొని మృతి చెందాడు. తండ్రి జిప్సంపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

భూవివాదంలో ఒకరిపై ఒకరు దాడి

సారంగాపూర్(జగిత్యాల): అర్పపల్లి గ్రామంలో భూవివాదం విషయంలో ఏర్పడ్డ గొడవలతో ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో ఇరు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై దత్తాద్రి తెలిపారు. అర్పపల్లికి చెందిన ఎద్దండి సంతోష్‌తో పాటు సంతోష్ తండ్రి మోహన్‌రెడ్డి, సంతోష్ అత్త బేతి సరళ వర్గానికి అదే గ్రామానికి చెందిన ముత్యాల తిరుపతిరెడ్డి, తిరుపతిరెడ్డి భార్య కళావతిల వర్గానికి మధ్య వ్యవసాయ భూమి విషయంలో వివాదం నెలకొంది. వివాదంలో ఒకరిని ఒకరు అసభ్య పదజాలంతో దూషించి దాడి చేసుకోవడంతో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆయిల్‌పాం సాగుపై అవగాహన

మానకొండూర్: ఆయిల్‌పాం సాగుపై వ్యవసాయ, ఉద్యానశాఖ, లోహియా ఎడిబుల్ ఆయిల్స్ వారి ఆధ్వర్యంలో శుక్రవారం మానకొండూర్‌లో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఉద్యాన అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. వరిపై ఆధారపడకుండా ఆయిల్‌పాం సాగు చేస్తే మేలు జరుగుతుందన్నారు. మన దేశంలో 140కోట్ల జనాభా ఉందని, 25 మిలియన్ టన్నుల నూనె కావాలన్నారు. అంతర్ పంటలతో కూడా అధిక లాభాలు వస్తాయని అన్నారు. మానకొండూర్ ఉద్యాన అధికారి రవళి, లోహియా కంపెనీ జగిత్యాల, కరీంనగర్ మేనేజర్ భరత్, ప్రతినిధులు రాజ్‌కుమార్, హరీశ్, సొసైటీ అధ్యక్షుడు పారిపెల్లి శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

గుండ్లపల్లెలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ వర్గీయుల ఘర్షణ


ఘర్షణలో గాయపడిన బీఆర్‌ఎస్ నాయకులు

ఓదెల(పెద్దపల్లి): మండలంలోని గుండ్లపల్లెలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ వర్గీయుల మధ్య ఘర్షణ జరిగింది. శుక్రవారం ఇదే గ్రామంలో మృతి చెందిన వ్యక్తి అంత్యక్రియలలో పాల్గొనే క్రమంలో గొడవ జరిగినట్లు సమాచారం. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మధ్య జరిగిన ఘర్షణలో పెద్దిరెడ్డి వెంకటరెడ్డి, పులుగు కుమార్‌రెడ్డి, పెద్దిరెడ్డి వెంకటరెడ్డి, నారాయణరెడ్డి, సమ్మిరెడ్డికి గాయాలయ్యాయి. సమాచారం తెలిసిన సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, పొత్కపల్లి ఎస్సై జి.అశోక్‌రెడ్డి సంఘటన స్థలాన్ని సందర్శించి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. ఈ విషయంపై పొత్కపల్లి ఎస్సై జి అశోక్‌రెడ్డిని వివరణ కోరగా.. ఇరువర్గాలకు కౌన్సెలింగు ఇచ్చామని, ఎలాంటి ఫిర్యాదు తమకు అందలేదన్నారు.

'శ్రీచైతన్య'లో బతుకమ్మ వేడుకలు


బతుకమ్మ వేడుకల్లో విద్యార్థులు



తిమ్మాపూర్ మండలం ఎల్‌ఎండీకాలనీలోని శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు సంప్రదాయ వస్త్రధారణలో వేడుకలకు హాజరయ్యారు. విద్యార్థినులు మహిళా అధ్యాపకుల సహకారంతో తీరొక్క పూలతో చూడముచ్చటగా బతుకమ్మలు పేర్చారు. కళాశాల మైదానంలో బతుకమ్మలను ఒక్కచోట ఉంచి డీజే పాటలకనుగుణంగా బతుకమ్మ ఆడారు. చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేసేదే బతుకమ్మ పండుగని అన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలని డైరెక్టర్ నరేందర్‌రెడ్డి, ప్రిన్సిపాళ్లు వెంకటేశ్వర్లు, ప్రసాదరాజు, నరసింహారెడ్డి సూచించారు. – తిమ్మాపూర్